క్లుప్తంగా

అభయాంజనేయస్వామి తీర్థం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీ శివారు 202 కాలనీలో అభయాంజనేయ తీర్థ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ పుష్పాలు,నిమ్మకాయలు,తమలపాకులతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, సిందూర, క్షీరాభిషేకాలు చేశారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్క గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ సిబ్బంది

గజపతినగరం రూరల్: బొండపల్లి మండలంలోని బి.రాజేరు గ్రామవాసి అయ్యిన కొట్నాన అశోక్‌కుమార్ పది మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎక్సైజ్ సీఐ జనార్దనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా మద్యం షాపులు రెండురోజుల పాటు మూసి ఉంచనున్నట్లు తెలిపారు. ఇదే అదునుగా భావించిన కొంతమంది బెల్ట్ షాపు నిర్వాహకులు మద్యాన్ని అమ్మినా, తరలించినా పట్టుకుని కేసులు నమోదుచేయనున్నట్లు చెప్పారు. ఈ దాడిలో సిబ్బంది ఫాతిమాభేగం, సౌజన్య, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు



సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని ఆకళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మార్చి1 నుంచి15వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. మండలానికి సంబంధించిన 422 మంది విద్యార్థులకు ఈ కేంద్రం కేటాయించారు. ఇక్కడ మెరకముడిదాం కేజీబీవీకి చెందిన 29 మంది, గర్భాం మోడల్ స్కూల్‌కు చెందిన 202 మంది, సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 141 మంది, ఎంఎస్ఆర్ ప్రైవేటు కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ప్రిన్సిపాల్ చెప్పారు.

రోడ్డుపైనే మురుగు ప్రవాహం



గోల్డుస్టార్ జంక్షన్ కాలనీ వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

లక్కవరపుకోట: మండలంలోని గోల్డుస్టార్ జంక్షన్ సమీపంలోని కాలనీ వద్ద బీటీ రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో ఆమార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో కాలనీవాసుల వాడుక నీరంతా పూర్తిగా రోడ్డుపైనే పారుతోంది. మురుగు వల్ల ద్విచక్ర వాహనాలు జారిపోయే ప్రమాదం ఉందని ఆమార్గంలో నిత్యం ప్రయాణించే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దుర్గంధం వెదజల్లుతుండడంతో పాటు దోమలు వృద్ధి చెందుతుండడం వల్ల స్థానికులూ అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.



కొత్తవలస : మంగళపాలెం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవలస: కొత్తవలసలోని విజయనగరం రోడ్డులో గల శివాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



శృంగవరపుకోట: పుణ్యగిరికి మెట్ల మార్గంలో వెళుతున్న భక్తులు

హర హర మహాదేవ



గంట్యాడ: పెదవేమలి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలు బుధవారం శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని పరమశివుడికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, పూజలు చేశారు. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపించడంతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కూడా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు ఆలయ ప్రాంగణాల్లో దీపారాధన చేశారు.

– సాక్షి నెట్ వర్క్

పులకించిన పుణ్యగిరి

శృంగవరపుకోట: శివనామస్మరణతో పుణ్యగిరి సానువులు పులకించాయి. తెల్లవారుజామున 4 గంటలకు ఉమాకోటిలింగేశ్వర స్వామి వారికి అర్చకులు అభిషే కాలు,అర్చనలు చేసి 5గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించారు. జిల్లా నలుమూలల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తర లివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు పుట్టుధార, ధారగంగమ్మలోయల్లో పవిత్ర స్నానాలు ఆచరించి పితృకార్యాలు చేశారు. త్రినాథగుహ, ధ్వజ స్తం భం వద్ద దీపారాధన చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ నారాయణమూర్తి నేతృత్వంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



శృంగవరపుకోట: పుణ్యగిరిలో దర్శనం కోసం నిరీక్షిస్తున్న భక్తులు



గజపతినగరం: పురిటిపెంట శివాలయం వద్ద ఓంకారం రూపంలో దీపారాధన



లక్కవరపుకోట: ఎల్.కోట శివాలయంలో సామూహిక రుద్రాభిషేకాలు



లక్కవరపుకోట : వీరభద్రస్వామి ఆలయం వద్ద అన్నదానం



కొత్తవలస: తుమ్మికాపల్లి ఓంసదనం ఆశ్రమంలో 108 శివలింగాలకు రుద్రాభిషేకం చేస్తున్న పురోహితులు



గుర్ల:గుర్ల శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలోని నీలకంటేశ్వర స్వామి దేవస్థానంలో క్యూలో ఉన్న భక్తులు



బొండపల్లి: గెద్దపేట శివాలయం వద్ద బారులుతీరిన భక్తులు



గజపతినగరం: గజపతినగరం శివాలయం వద్ద భక్తుల రద్దీ



దత్తిరాజేరు: కోమటిపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవలస: కొత్తవలసలోని వాగ్దేవి కళాశాలలో రుద్రహోమం చేస్తున్న కళాశాల యాజమాన్యం



లక్కవరపుకోట: ఎల్.కోటలో కల్యాణం అనంతరం శివపార్వతుల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



కొత్తవలస : జాగరణలో భాగంగా కొత్తవలస వాగ్దేవి కళాశాలలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు



లక్కవరపుకోట: కళ్లేపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు



వేపాడ:బొద్దాం ఉమా బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు



మెరకముడిదాం: మెరకముడిదాం ఉమాసోమలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దత్తిరాజేరు: గడసాం శివాలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



బొండపల్లి: బోడసింగిపేటలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగాలు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజారావు



దత్తిరాజేరు ఉన్నత పాఠశాలలో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయభాస్కర్



మెరకముడిదాం ఉన్నత పాఠశాలలో బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ అజు రఫీజాన్



గుర్ల హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం నిర్వహించనున్నారు. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది బుధవారం చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీ ల్దార్‌లు, డీటీలు సందర్శించి, ఏర్పాట్లు పరిశీలించారు. ఎల్.కోట, కొత్తవలస ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ ఎన్నికల అధికారి రవికిరణ్ పరిశీలించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని పోలింగ్ సిబ్బందికి అధికారులు సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్

ఘనంగా బెల్లాన పుట్టినరోజు వేడుకలు



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

చీపురుపల్లి: విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పుట్టినరోజు వేడుకలను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీ, నాయకులు ఇప్పిలి గోవింద, పతివాడ రాజారావు, బెల్లాన త్రినాథరావు, కోరుకొండ దాలయ్య, కొమ్ము చిరంజీవి, రేవళ్ల సత్తిబాబు పాల్గొన్నారు.

నిలువ నీడ కరువు

- పెరుగుతున్న ఎండల తీవ్రత
- ఉపాధి పని ప్రదేశాల్లో కానరాని వసతులు
- టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేని వైనం

గజపతినగరం రూరల్: వేసవి ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఉదయం పదిగంటలకే ఎండల వల్ల బయట నిలబడలేని పరిస్థితి. ఇటువంటి వాతావరణంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు కాసేపు సేదతీరుదామనుకుంటే వారికి నీడ కరువవుతోంది. ఉపాధి పని ప్రదేశాల వేతనదారులకు కనీస సదుపాయాలు లేవు. ఉపాధి పనులకు అధిక శాతం మహిళలు, వృద్ధులు హాజరవుతున్నారు. వారిలో చాలామంది ఎండవేడిమికి తట్టుకోలేక నీడలో సేదతీరేందుకు పనిమధ్యలో దగ్గర్లో ఉన్న చెట్లను వెతుక్కోవాల్సి వస్తోంది. గతవైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023లో వేతనదారుల కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేశారు. 2024లో ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ చేయలేదు. 2023లో ఇచ్చిన టెంట్లనే కొన్ని గ్రామాల్లో వినియోగిస్తున్నారు. అయితే వాటిలో చాలావరకు పాడైపోయాయి. ప్రథమ చికిత్స కిట్లు అడ్రస్ లేకుండా పోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గజపతినగరం మండలంలో వేతనదారులకు ఒక్కటంటే ఒక్క టెంట్ కూడా అందించ లేదు. గత ప్రభుత్వంలో వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందించే వారు.ప్రస్తుతం ఆ సదుపాయాలేవీ లేవు. గజపతినగరం మండలంలోని 28 పంచాయతీల్లో 12 వేల జాబ్‌కార్డులు ఉండగా 13 వేలకు పైగా వేతనదారులున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో టెంట్లు, ప్రథమచికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని వేతనదారులు కోరుతున్నారు.



గంగచోళ్లపెంట గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

కనీసం టెంట్లు అయినా అందించండి

ఉపాధి పనులు జరుగుతున్నచోట కనీస వసతులు కల్పించాలి. టెంట్లు, ప్రథమచికిత్స కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలి. వేసవి పూర్తిగా ప్రారంభం కాకముందే ఎండలు మండిపోతున్నాయి. ముందు ముందు చాలా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఉపాధి హామీ అధికారులు వేతనదారుల కోసం కనీసం టెంట్లు అయినా అందించాలి. – లెంక రామునాయుడు, ఉపాధి వేతనదారుడు, మరుపల్లి, గజపతినగరం మండలం

సదుపాయాలు కల్పిస్తాం..

వేతనదారులకు సదుపాయాలు కల్పిస్తాం. ఇంకా ప్రభుత్వం నుంచి ఈ ఏడాది టెంట్లు సరఫరా కాలేదు. కొన్ని గ్రామాల్లో గతంలో అందజేసిన టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఉన్నాయి. ప్రభుత్వం టెంట్లు సరఫరా చేసిన వెంటనే వాటిని పంపిణీ చేస్తాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తాం, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించాం.

– సీహెచ్ రామారావు, ఏపీఓ, గజపతినగరం మండలం

ఉత్కంఠగా సాగిన పోటీలు



పోటీల్లో పరుగుతీస్తున్న ఎడ్లు



దౌడు తీస్తున్న గుర్రం

బొండపల్లి: కొత్తపాలెం గ్రామంలో కృష్ణమ్మతల్లి పేరంటాల తీర్థ మహోత్సవం సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము, సర్పంచ్ బొడ్డు సత్యవతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలతో గుర్రం, ఎడ్ల పరుగు పందెం పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. విజేతలకు రాష్ట్ర చిన్న,మధ్యతరహా, సెర్ప్,ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. తీర్థం సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.